

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

(ప్రారంభం)

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్థం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

(శ్రీరాముడు సీతాసమేతుడై పద్నాలుగేళ్ళు అరణ్యవాసం చేయబోతున్నాడనీ, అన్నగారి సేవలకై లక్ష్మణుడు కూడా వారిని అనుసరించి అరణ్యాలకు తరలి వెళ్తున్నాడనే వార్త అంతఃపురమంతా కార్చిచ్చులా వ్యాపించింది.)

ఏదో రాచకార్యం మీద కైకేయి మందిరానికి వెళ్ళిన తన భర్త లక్ష్మణస్వామి ఇప్పుడో, ఇంకాస్సేపటికో వస్తాడని ఎదురుచూస్తూ, భర్త రూపాన్నీ, ఠీవినీ, చమత్కార పూరిత సంభాషణలనీ, మరీ మరీ గుర్తు చేసుకుంటూ చిలుకలకు ఆహారం అందిస్తున్న ఊర్మిళ ఒక్కసారిగా ఆ వార్త విని నిర్ఘాంత పోయింది.

"ఇది నిజమా? నువ్వు సరిగా విన్నావా?" తడబడుతూ ఈ వార్త మోసుకు వచ్చిన తన పుట్టినింటి 'అరణపు దాసీ' పూర్ణిమను అడిగింది ఊర్మిళ.

పూర్ణిమ ప్రౌఢ స్త్రీ. ఆమె కట్టూ, బొట్టూ ప్రత్యేక తరహాలో హుందాగా వుంటాయి. ఆమె నవ్వు నిండు పున్నమి లాటి వెన్నెలలా చల్లగా, హాయిగా వుంటుంది. ఆమె మాట ఎల్లప్పుడూ మృదువుగా వుంటుంది. అవసరమయితే పదునుగానూ

వుంటుంది. చాడీలు చెప్పే స్వభావం కానీ, తాను విన్న చూచిన విషయాలకు మరికొన్ని అతిశయోక్తులు కలిపి చెప్పే సగటు స్త్రీ స్వభావం ఆమెకు లేవు. ఊర్మిళకు ఊహ తెలిసినప్పటి నుంచీ ఆమె ఊర్మిళకు దాదిగానే వుంది.

పూర్ణిమ భర్త చంద్రశేఖరుడు. అతడు జనక మహా చక్రవర్తి సైన్యంలో ఓ ప్రముఖ పదవి నిర్వహిస్తూండే వాడు. పూర్ణిమ అంతఃపుర దాసీగా వుండేది. వారి ఇద్దరిదీ అన్యోన్య దాంపత్యంగా వుండేది. రాచనగరులో ఒక ఉద్యోగినిగా, ఒక ఉద్యోగి భార్యగా పూర్ణిమకు రాచనగరులోని మర్యాదలన్నీ క్షుణ్ణంగా తెలుసు. రాచరికపు కట్టుబాట్లు, కఠిన నియమ పాలనలూ ఆమెకు బాగా తెలుసు.

ఒక్కొక్కసారి రాజసూయ యాగం సందర్భంగా యజ్ఞాశ్వం వెంట వెళ్ళే వీరులలో చంద్ర శేఖరుడు తప్పనిసరిగా వెళ్ళవలసి వచ్చేది. అలాటప్పుడు కొన్ని మాసాల వరకూ పూర్ణిమ భర్త రాక కోసం నిరీక్షిస్తూండ వలసి వచ్చేది.

ఒక్కొక్క సారి ఏదయినా యుద్ధం అనివార్యమయినప్పుడు, చంద్ర శేఖరుడు దేశాంతరం వెళ్ళవలసి వచ్చేది. ఆమె తన భర్తకు విజయం చేకూర్చమనీ, తన భర్త క్షేమంగా తిరిగి రావాలనీ ఆకాంక్షిస్తూ తన యిష్ట దైవం అయిన పరమేశ్వరుడిని అనుక్షణం ప్రార్థిస్తూ క్షణమొక యుగంగా గడిపేది. చంద్రశేఖరుడు తిరిగి వచ్చాక, తన సాహస యాత్రలలోని విశేషాలు ఆమెకు చెబుతున్నప్పుడు, తన భర్తను గురించిన గర్వంతో అలాటి వీరునికి వీరపత్ని కాగలిగిన తనమీద తనకే కలిగే గర్వంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయేది.

ఓసారి చంద్రశేఖరుడలాగే ఓ రాచకార్యం మీద పొరుగు దేశం వెళ్ళాడు. మాసాలు... సంవత్సరాలు... షుమారు మూడు సంవత్సర కాలం దొర్లి పోయింది. భర్త కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తోంది ఆమె. ఓ సుప్రభాత సమయాన చంద్రశేఖరుడు వచ్చాడు. కానీ అతడు ఒక్కడూ రాలేదు. వెంట ఒక స్త్రీని పిల్చుకు వచ్చాడు. ఆమె అందచందాలలో పూర్ణిమ కంటే రవంత తక్కువగానే వుంది.

“ఈమె నా మరో భార్య. నీకు చెల్లెలు అవుతుంది. ఈ క్షణం నుంచీ, మీ ఇద్దరూ నా రెండు కళ్ళలాంటి వారు. నీవామెను ఆదరించు. మనం ముగ్గురం కలిసి బ్రతుకుదాం” అన్నాడు చంద్రశేఖరుడు.

పూర్ణిమ శిలలా నిల్చుండి పోయింది, శిల్పంలాగా మూగబోయింది. బహు భార్యత్వం తప్పు కాదు. నిషిద్ధమూ కాదు. ఒక్కో మహారాజు, సేనాధిపతి, సైన్యంలో పనిచేసే సైనికులు ఇలా ఎవరైనా సరే ఒకరి నుంచి పదిమందికి పైగా భార్యల్ని పెళ్ళాడటమూ, పోషించడమూ జరుగుతూనే వున్నాయి. రాచనగరులు రాజవంశాలతో, వారి సంతానాలతో వారి వారి మధ్యగల సవతి మాత్సర్యాలు, సవతి బిడ్డల పోరులు అంతర్యుద్ధాలతో కిక్కిరిసి వుంటాయి.

కానీ పూర్ణిమకు ఎంచేతో తన భర్త చేసిన ఈ పని నచ్చలేదు. ఇదో రకమయిన వెన్నుపోటులా, ఆత్మ ద్రోహంలా అనిపించింది.

తను తన భర్తను దైవంలా భావించి ఆరాధిస్తోంది. ప్రేమిస్తోంది. తన భర్త నుంచి తనకలాటి ఆరాధనా భావమూ, ప్రేమే కావాలి. ఇన్నేళ్ళుగా తామిద్దరి మధ్యా ఆ పరస్పర అవగాహన, ఆరాధన ఉంటూ వచ్చాయి. "ఒకరికోసం మరొకరం" అనే భావన బలంగా వుండేది. ఈ క్షణంలో భర్త ఆ భావనని తోసి పుచ్చాడు. పురుషుని అవసరానికి మరో భార్య అవసరమని తోచినప్పుడు, అతడు మొదటి తాలూకు ప్రేమనీ, ఆరాధననీ సమూలంగా నరికి వేసి మరో స్త్రీని పెళ్లాడ వచ్చన్న సగటు పురుష ప్రకృతికి లొంగి పోయాడు.

తను చేసిన నేరం ఏమిటి? తానే విధంగా అతని ప్రేమ నుంచి వంచింపబడింది? అతని కోసం నిముషమో యుగంగా వేచి చూచింది. నిజానికి రాజాంతఃపురాలలో ప్రముఖ దాదిగా వుండే తనబోటి స్త్రీ, అందచందాలలోనూ, చతుర సంభాషణలలోనూ, రాజకీయ పరిజ్ఞానంలోనూ మేటి అయిన తన బోటి స్త్రీ కడగంటి చూపుల కోసం పడిగాపులు గాసే పురుషులెందరో వున్నారు. తప్పుదారి పట్టదల్చుకున్న వారికి అవకాశాలు ఎన్నయినా వున్నాయి. కానీ తను ఏ క్షణంలోనూ తన ఇంగితం కోల్పోలేదు. భర్త దేశాంతరగతుడై ఉండనీ, సంవత్సరాల తరబడి తమ మధ్య సన్నిహిత సంబంధం లేకపోనీ, తను శిలలా తన భర్త రాక కోసం, ఆ భర్త స్పర్శ కోసం నిలచి వుందే గానీ అన్యమైన ఆలోచనలకు తావివ్వలేదు.

ఎన్నో మార్లు భర్తతో తను వినోదయాత్రలో, మరేదైనా సరదాలో గడపాలనుకున్నప్పుడు, భర్త రాచరికపు ఆజ్ఞల మేరకు కర్తవ్య పాలనలో మునిగి పోవలసి వచ్చేది. అలాటప్పుడు అతను చాలా నొచ్చుకునే వాడు. "ఈ రాచరికపు జీవితాలు ఓ విధమైన బానిస బ్రతుకులు పూర్ణిమా! ఇక్కడ కర్తవ్యపాలనే తప్ప, బాంధవ్యాలకూ ఆత్మీయతలకూ ప్రాధాన్యత వుండదు. ఈ పని మానేయనా?" అనేవాడు.

తను నవ్వేది. "వద్దు. అది బానిసత్వం కాదు. ఈ కఠోర కర్తవ్యపాలనలోనే మనిషి వ్యక్తిత్వం ఒరిపిడి పడుతుంది ఆత్మ సంయమనం యినుమడిస్తుంది. మీరు వీరులు. మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించండి" అని ప్రభోదించేది.

అలాంటి తనని... ఇలా వంచించి, పరస్త్రీని పరిగ్రహించి వెంటబెట్టుకు రావడం ద్రోహం కాదా?

దానికి బదులుగా "పూర్ణిమా! నీలో నా ఇల్లాలిగా వుండగల ఫలాని అర్హతలు కొరవడ్డాయి. నీవు తొలగు. మరో స్త్రీని నేను పెళ్ళాడుతాను" అని తనకి చెప్పి ఉంటే అతని చంచల స్వభావాన్ని అంచనా వేసుకుని తానే వైదొలగి వుండేది.

ఇప్పుడా స్త్రీని తను సోదరిలా ప్రేమించగలదా? ఏనాటికీ ప్రేమించలేదు.

పోనీ సగటు గృహిణులందరిలాగానే సవతి మీద ద్వేషం కార్చిచ్చులా లోలోపల దహించి వేస్తుంటే, పైకి విషపు చిరునవ్వులు నవ్వుతూ సర్దుకు పోగలదా! ఊహుఁ. అది తనకసాధ్యం. అద్దంలాటి తన హృదయంలో తన ముఖంలో ఏ భావం... అది సంతోషం గానీ, ద్వేషంగానీ దాగలేవు. ప్రతిబింబించి తీరుతాయి.

తన సవతి బిడ్డలచేత ఈసడించబడుతూ, వారిని అనుసరించుకుని తను జీవించగలదా? ఊహుఁ! తనవల్ల కాదు.

"పూర్ణిమా! నీకు కష్టం కలుగుతుందని తెలుసు. అయినా నీవు నన్ను క్షమించగలవనీ, ఈమెని ఆదరిస్తావని ఆశతో పెళ్ళాడి తెచ్చాను." భర్త మళ్ళీ అన్నాడు. భర్త కోసం స్వాగత హారతి వెలిగించిన పూర్ణిమ ఆ హారతి పళ్ళెం మెల్లిగా పక్కన పెట్టింది. హృదయంలోని దావానలాన్ని అలా ఆపింది. చిరునవ్వుతో అంది. "సరే, మీరా స్త్రీని పెళ్ళాడారు. కారణాలు ఏమిటన్నవి నాకిక అనవసరం.

నేనూ మీలానే రాచరికపు కఠోరతలూ, కర్తవ్యపాలనల మధ్య నన్ను నేను తీర్చిదిద్దుకున్న వనితని. నాకీనాడు భుక్తికి భయం లేదు. అంతఃపుర దాసీగా వున్నాను. అలాగే వుండి పోతాను.

ఈమె మిమ్మల్ని నమ్ముకుని వచ్చిన స్త్రీ. పరరాజ్యం నుంచి అయిన వారినందరినీ విడిచి, మీ అండ నమ్ముకుని వచ్చిన స్త్రీ. ఈమె ఇక్కడి వాతావరణానికి, పద్ధతులకీ అలవాటు పడటానికి కొంతకాలం పట్టవచ్చు. ఆమె మీ భార్యగా వుండనివ్వండి. శలవు."

చంద్రశేఖరుడు మొత్తుకున్నా వినిపించుకోలేదు ఆమె. చివరకు అతడా స్త్రీని వదిలి వేస్తాననే స్థాయికి దిగజారాడు. ఈ పనిని అసలు హర్షించలేదు ఆమె. "ఆమెకోసం నా మీద ప్రేమను తెంచేశారు. నా కోసం తిరిగి ఆమెని వదిలి వేయటం, ఇది మహాపతనం. ఈ పతనానికి అంతం వుండదు, ఒద్దు" అంది.

పూర్ణిమ తల్లి చాలా దూరం చెప్పింది. భర్తని క్షమించమనీ, అతనితో సవతితో సర్దుకు పొమ్మనీనూ. పూర్ణిమ నవ్వి వూరుకుంది.

ఆ తర్వాత ఆమె అంతఃపురంలోనే వుండిపోయింది ఊర్మిళ తల్లికి ముఖ్య సేవికగా, అంతఃపుర ముఖ్య దాసిగానే తనని తాను మలుచుకుంది, తన సేవాస్వభావంతో ఖచ్చితమైన పద్ధతులతో. ఊర్మిళ ఆలనా పాలన అంతా ఆమెకి అప్పగించ బడింది. ఈ పనిలో నిమగ్నమై పోయి, తన భర్త తన హృదయం మీద చేసిన అఘాతాన్ని పదే పదే గుర్తు చేసుకోకుండా వుండి పోయింది. చంద్రశేఖరుడు రాజాస్థానంలోనే వుండేవాడు. ఆ తర్వాత అతడు ఇద్దరు ముగ్గురు భార్యల్ని పెళ్ళాడాడు. అంతా కలిసే జీవించేవారు. పిల్లలు పుట్టారు. అన్నీ చూస్తోంది. అన్నీ వింటోంది. కానీ ఏదీ ఆమెనిప్పుడు చలింప జేయటం లేదు. ఆ మనఃస్థితిని సాధించుకుంది. తాత ముత్తాతల నుంచి ఆయుర్వేద వైద్యంలో

నిష్ణాతులు. ఆమెకూ ఆ వైద్య ప్రక్రియలన్నీ అస్తిగతం అయ్యాయి. అంతఃపురంలో స్త్రీలకు సంబంధించిన వ్యాదులు అన్నిటికీ ఆమె వైద్యురాలు. అలా తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూనే శిలలా వుండిపోయింది. ఆమె పరపురుషులతో వెకిలిగా ప్రవర్తించిన సందర్భాలు గానీ పర పురుషులను ఆకర్షించే ప్రయత్నాలు గానీ ఎన్నడూ  చేయలేదు. తీరిక వేళల్లో తన ఇష్టదైవం అయిన ఈశ్వర ధ్యానంలో మునిగి పోయేది. తనకు అప్ప జెప్ప బడిన ఊర్మిళ పెంపకమూ, పర్యవేక్షణా... అనే కర్తవ్యాన్ని తన అస్తిగత విధిగా నిర్వర్తిస్తోందామె నాటికీ నేటికీ. ఆ కారణంగా కూడా ఊర్మిళ తల్లికి ఆమె అంటే వల్లమాలిన అభిమానం వుంది. ఆమె పెంపకంలో ఊర్మిళ పెరుగుతోంది ముగ్ధ మనోహరంగా.

శివ ధనుర్భంగం తర్వాత శ్రీ రామచంద్రుదు సీతాదేవిని పరిణయమాడాడు. లక్షణ, భరత, శత్రుఘ్నులు వరుసగా ఊర్మిళనూ, మాండవినీ, శ్రుతకీర్తినీ పెళ్ళాడారు.

అయోధ్యకు నవ వధూవరులందరూ తరలి వెళ్ళే సమయంలో సారెతో బాటు, రాచరికపు అనుచాన సంప్రదాయాన్ననుసరించి అరణపు దాసదాసీలు కూడా బయలు దేరారు.

"పూర్ణిమా!  నీ భర్తతో గత పద్నాలుగేళ్ళుగా నీకు సంబంధం లేదు. నీవు శిలలా అంతఃపురంలో నిలిచి పోయావు. ఊర్మిళ దాదిగా, ఒకవిధంగా నాకంటే ఎక్కువగా ఊర్మిళ ఆలనా పాలనా నీవే చూచుకున్నావు, ఊర్మిళకు నీవు దాసివే కావు. స్నేహితురాలివి. ఆత్మీయురాలివి  కూడా. అయోధ్యలో నీకు సరిపడే వాతావరణం వుంటుందో లేదో. ఎప్పుడైనా నీ భర్తను చూడాలనీ, తిరిగి అతనితో కలిసి జీవించాలనీ అనిపిస్తుందేమో. మన రాచరికపు సాంప్రదాయాలననుసరించి ఒకసారి మెట్టినింటికి వెళ్ళిన స్త్రీ తిరిగి పుట్టినింటికి పదే పదే వచ్చే వీలు లేదు. ఏదో అనుకోని అవాంతరం వచ్చి పడినా, ఆమె భర్త ఇంటనే వుండటానికి ఇష్టపడుతుందే గానీ పుట్టినింట పడి ఉండేందుకు అంగీకరించదు.

అలాంటప్పుడు నీవు అక్కడ బాధపడతావో ఏమో. నీవు మిథిలలోనే వుండదల్చు కుంటే వుండిపో. నీకేమీ అభ్యంతరం లేదు" అంది ఊర్మిళ తల్లి. పూర్ణిమను ఏ విధంగానూ నొప్పించదామే. పూర్ణిమ అంటే ప్రత్యక గౌరవాభిమానాలున్నాయి ఆవిడకు.

పూర్ణిమ నవ్వింది. "భర్త ప్రేమ నుండి వంచింపబడిన స్త్రీకి మిథిల అయినా, అయోధ్య అయినా స్వర్గం అయినా నరకం అయినా ఒకటే అమ్మా! ఈ మిథిలా నగరంలో నా భర్తతో అత్యంతానందకరమైన దాంపత్య జీవితం గడిపాను కొన్నేళ్ళు. ఈ మిథిలలోనే అతడు మరొక స్త్రీ, మరొక స్త్రీ ఇలా భార్యలతో బిడ్డలతో తన ఆనందాన్నితాను చూచుకుంటుంటే వింటూ సహిస్తూ జీవించాను ఇన్నాళ్ళూ. ఓ విధంగా మీరు నా మీదగల వాత్సల్యంతో చిట్టితల్లి ఊర్మిళ పెంపకం బాధ్యత అప్పగించారు. అందులో నన్ను నేను మర్చిపోయే అవకాశం కల్పించారు. ఊర్మిళ వెంట అయోధ్యకు వెళతాను. ఆమెను

కన్నతల్లిలా కంటికి రెప్పలా ఇటు దాదిగానూ అటు వైద్యురాలిగానూ, ఆత్మీయురాలిగానూ అనుక్షణం కనిపెట్టుక వుంటాను. ఆమె చల్లని కాపురాన్ని కళ్ళారా చూస్తూ అందులో నా శిధిల దాంపత్య జీవిత పీడకలని మర్చిపోతూ, ఊర్మిళకు పుట్టబోయే బిడ్డలను లాలిస్తూ నా శేష జీవితం గడిపేస్తాను. అరణపుదాసిగా వెళ్ళవలసి వచ్చిందని నేను కించపడటం లేదు. ఆ అవకాశం వచ్చినందుకు సంతోషిస్తున్నాను. ఊర్మిళకు నేనున్నాను. మీరు ఆమె గురించి నిశ్చింతగా వుండండి. ఆమె జీవితంలో ఎదురయ్యే మంచి చెడు అన్నింటిలోనూ ఛాయలా కన్నతల్లిలా వుంటాను. అనుజ్ఞ ఇవ్వండి" అంది.

ఊర్మిళ వెంట ఆమె అయోధ్యకు వచ్చింది. కొన్ని రోజులలోనే పూర్ణిమ దశరథ మహారాజు వారి రాణులందరి అంతఃపురాలలోనూ చాకచక్యంతో ఓ ప్రతేక గౌరవాభిమానాలను పొందగలిగింది. స్త్రీలలో అరుదుగా వుండే ఆజానుబాహు శరీరం గలిగిన పూర్ణిమ నవ్వినా నడచినా, మాట్లాడినా తనదైన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే పూర్ణిమ అంటే అంతః పుర స్త్రీ లందరికీ ఓ ప్రత్యేక అభిమానం ఏర్పడింది. పైగా చాడీలు గానీ, అనవసరంగా అబద్ధాలు చెప్పటంగానీ, అతిశయోక్తులు వల్లించటం గానీ, లేకి మనస్తత్వం గానీ లేని ఆమెపట్ల ప్రతి ప్రాణికి ఆప్యాయత, ఆదరణ కలిగాయి.

ఊర్మిళా, లక్ష్మణుల దాంపత్యం చల్లగా సాగిపోతోంది. అంతఃపురానికి లక్ష్మణుడు వెంచేస్తున్నాడని తెలియగానే ఆమె తనకై కేటాయించబడిన ప్రత్యేక మందిరానికి వెళ్లి పోతుంది.

ఊర్మిళకి ఆమె దగ్గర దాచే రహస్యాలు గానీ, చెప్పుకోలేని మాటలుగానీ ఏమీ లేవు ఆనాడూ ఈనాడూ.

ఊర్మిళ చిన్నతనం నుంచీ బిడియస్తురాలు. తనంత తానుగా ఇతరులతో కలవలేదు. ఆమెని పలకరించి ఆత్మీయతగా మాట్లాడితే మాట్లాడుతుంది, లేకపోతే మౌనంగా ఉండిపోతుంది. అంచేతే అంతఃపురంలో ఒక్క లక్ష్మణ స్వామి తర్వాత పూర్ణిమ ఒక్కర్తె ఆమెకి సన్నిహితురాలు.

శ్రీరామ పట్టాభిషేక వార్త అయోధ్యనంతటినీ ఆనంద సాగరంలో ముంచి వేసింది. ఆనందోత్సవాలలో అయోధ్య నగర వాసులెవరూ ఆ రాత్రి నిద్రించలేదు. కానీ మంథర ప్రజ్వరిల్ల జేసిన విషాగ్నికీలలో కైకేయి మనసూ, హృదయము, మందిరమూ, వాక్కూ భగ్గుమన్నాయి. ఉషోదయంతో బాటు శ్రీరామ పట్టాభిషేక సన్నాహాలు మరుగునపడి శ్రీరామ వనవాస సన్నాహాలు ప్రారంభమై పోయాయి. ఈ వార్త తెలిసింది ఊర్మిళకు.

"పూర్ణిమా! ఇది నిజమేనా? నీవు సరిగా విన్నావా? నేను మేలుకునే వున్నానా? లేక పీడకల గంటున్నానా?" అంది ఊర్మిళ, ఆమె భుజాలు పట్టుకు కుదుపుతూ.

"నిజమే తల్లీ!" అంది ఆమె అతి హీనస్వరంతో. ఆమె ముఖం గ్రహణం నాటి చందమామలా మ్లానమై పోయింది. ఊర్మిళ హృదయ ఘోష ఎలా వుందో ఆమెకు తెలుస్తోంది. తన భర్త, "నేనీ స్త్రీని పెళ్ళాడాను" అంటూ చెప్పిన క్షణంలో తన హృదయంలో ఎలా ఓ క్షణకాలం స్పందన ఆగిపోయిందో ఊర్మిళ స్థితీ అదేననీ ఆమెకు స్పష్టంగా తెలుస్తూనే వుంది.

"పద్నాలుగేళ్ళు బావగారు శ్రీరామచంద్రులు అరణ్యవాసం చేయాలా? సీతక్క కూడా వారి వెంట వెళుతోందా?" ఎగసి పడుతున్న గుండెలతో ఓ విధమైన అదురుపాటు మాటలలో ప్రతిధ్వనిస్తుండగా అడిగింది ఊర్మిళ.

"అవును తల్లీ! పధ్నాలుగేళ్ళు శ్రీరామచంద్రులు వనవాసం చేయాలనీ, భరతుల వారికి పట్టాభిషేకం జరిపించాలనీ ఆ వరాలు ..... కాదు కాదు ఆజ్ఞాపించారు కైకమ్మ తల్లిగారు. సీతమ్మ శ్రీరామచంద్రులని అనుసరిస్తోంది అరణ్యాలకు. వారిద్దరినీ సేవించేందుకు లక్ష్మణ స్వామి కూడా అరణ్యాలకు వెళుతున్నారు." పూర్ణిమ మెల్లిగా విషయమంతా చెప్పింది సంక్షిప్తంగా.

"మరి నేనో?" ఊర్మిళ అమాయకంగా అడిగింది.

ఆమె మాట్లాడలేదు క్షణ కాలం.

ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి ఈ చిట్టితల్లికి?

ఓ మహారాజు వందల కొద్ది భార్యల్ని పెళ్ళాడే హక్కు కలిగివున్న సాంప్రదాయాలివి. ఆ రాణులకు కలిగే సంతానాలలో ప్రధమ సంతానానికి రాజ్యార్హత వుంటుంది. ఆ మహారాణికే పట్టమహిషి గౌరవం వుంటుంది. మిగతా రాణులు పేరుకు మహారాణులు. వారి సంతానం రాజవంశీయులు, రాజసేవకులే గానీ రాజ్యార్హత గలిగిన రాజకుమారులు కాలేరు. కాబోరు. వారికి వచ్చే భార్యలు, యువరాణీల గౌరవ వాచకం గలిగిన వారే గానీ రాజు అయ్యే వ్యక్తి యొక్క భార్యకుండే గౌరవం, ప్రత్యేకతా వుండవు.

కైకేయి విషయంలో ఆమె బిడ్డకే రాజ్యం యిస్తానని మహారాజు ఆమెను పెళ్ళాడే సమయంలో వాగ్దానం చేసి ఉన్నాడని చెబుతున్నారు. ఇదంతా ఓ గందరగోళపు రాజకీయం. సమర్థులయిన మంత్రులూ, పురోహితులు ధర్మ నిర్ణయం చేయవలసిన అతి సూక్ష్మమైన అంశం ఇది. అయితే ఒకానొక బలహీన క్షణంలో మోహ వివశుడైయిన వృద్ధరాజు ఇచ్చిన వాగ్దానం నెరవేరి తీరాలని కైకేయి పట్టుదల. శ్రీరామ చంద్రుని వనవాసం అనవసర అంశమే అయినా అదే ప్రధాన సమస్యగా మారిందిపుడు.

లక్ష్మణస్వామి అన్నగారిని అనుసరించటంలో సంప్రదాయమూ, రాచ వంశ కర్తవ్యమూ, భాతృ ప్రేమ మరెన్నో నిండి వున్నాయి. ఇవన్నీ ఊర్మిళకు అవగతం ఎలా అవుతాయి? పైగా తన భర్త తననుంచి దూరమైపోతాడేమోనని ఆందోళనలో వున్న ఈ స్త్రీకి రాజకీయాలను వివేచన చేసేంతటి వోర్పూ, స్థిమితమూ ఎలా వుంటాయి?

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments